కథ

# అంతిమ కోరిక

-ఎమ్. నాగమణి

పార్వతమ్మ కుటుంబ సభ్యులని ఎంతగానో కృంగదీసింది ఆమె ఆరోగ్య పరిస్థితి. ఆమె మరెంతో కాలం బ్రతకదని ఖచ్చితంగా చెప్పేశారు ఫామిలీ డాక్టరు ఒక రోజున. కొంతకాలంగా ఆమె అస్వస్థతగా ఉంటున్న విషయం అందరికీ తెల్సినా, ఆమె ఆరోగ్యం రోజు రోజుకీ క్షీణిస్తోందని అందరూ గమనించినా, డాక్టరు అలా చెప్పేసరికి దిగాలు పడిపోయారు అందరూ. ఆ నిజం చాలా చేదుగా అన్పించింది.... ముఖ్యంగా ఆమె ముగ్గురు పిల్లలకీ. పెద్ద కొడుకును దగ్గరకు పిల్చి "ఒరేయ్ ఆనందూ...... నాకో చిన్న కోరిక ఉందిరా.... తీరుస్తావా?" అంది లాలనగా. ఆనందరావు కళ్ళల్లో గిరుక్కున నీళ్ళు తిరిగాయి. ఒకప్పుడు ఎంతో ఆరోగ్యంగా ఆనందంగా తిరిగిన తల్లి ఎంతో నిస్సహాయంగా అలా ప్రక్కపై వాలి పోయి అస్థి పంజరంలా కన్పిస్తూంటే అతని హృదయం మౌనంగా రోదించింది.

"అలాగే అమ్మా.... చెప్పు...." అన్నాడు బలహీనంగా ఉన్న తల్లి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"ఉఁహూ.... రేపు చెప్తాలేరా..... రేపు నీ పుట్టిన రోజు!" అంది పార్వతమ్మ పేలవంగా నవ్వుతూ.

ఈ పరిస్థితిలో కూడా ఎంతబాగా గుర్తు పెట్టుకుంది అమ్మ తన పుట్టిన రోజుని! అనుకున్నాడు ఆనందరావు.

"రాము కొడుకు త్వరలో అమెరికా వెళ్తున్నాడటగా.... ఉదయం చెప్పాడు రాము. ఏమిటోరా.... ఉన్న ఒక్క కొడుకునీ విదేశాలకి పంపేస్తున్నారు వీళ్ళు.... అక్కడ ఏం బావుకుందామని చెప్పు...." ప్రక్కకి ఒత్తిగిలి పడుకుంటూ అంది పార్వతమ్మ.

"రాముకి అంతగా లేదు కానీ రోహిణికి బాగా ఇష్టం ఉన్నట్లుంది అమ్మా రమేష్‌ని అమెరికా పంపడం. పోనీలే.... కొంతకాలం తరువాత తిరిగి వస్తాడులే..."

"నీ కూతుళ్ళ పెళ్ళి విషయం ఏం చేశావు ఆనందూ? ఆ రామాపురం సంబంధాలు ఖాయం చేసుకుంటే పోలా? ఆడపిల్లలిద్దరూ ఒకే ఊర్లో ఉంటారు....."

"ఉమ, రమ ఇద్దరూ ఎం.ఏ. చదవాలని పట్టు పట్టున్నారు అమ్మా.... అప్పుడే పెళ్ళి వద్దంటున్నారు."

"పోనీలే..... చదువుకోనీయ్ నాయనా... వాళ్ళంతట వాళ్ళే చదువుకుంటాం అంటుంటే మనం ఎందుకు కాదనాలి? కానీ అక్కయ్య ఈ సంవత్సరం తన కూతురికి పెళ్ళిళ్ళు చేయాలనుకుంటోందిరా.... ఏమిటో దానికి సరయిన సంబంధం దొరకడంలా...."

"నువ్వు ఇలాంటి ఆలోచనల్తో మనసు పాడుచేసుకోకు... విశ్రాంతి తీసుకో... అన్ని సమస్యలూ కాలానుసారం వాటంతటవే పరిష్కారం వెతుక్కుంటాయ్.... ఉండు.... నీకు మందు వేసుకునే టైమయింది. పళ్ళ రసం రెడీ చేశారేమో చూసొస్తా..." అంటూ క్రిందికి వెళ్ళిపోయాడు ఆనందరావు.

"అమ్మకంత తీరని కోరిక ఏం ఉండి ఉంటుంది సరూ!" అన్నాడు ఆనందరావు భార్య ముఖంలోకి చూస్తూ.

"ఉండకపోతే అంత హడావుడిగా మీ అక్కయ్యనీ, మీ తమ్ముడినీ ఎందుకు పిలిపించి ఉంటారులే!" అంది సరోజిని మంచానికి దోమ తెరకడ్తూ.

"దాన్దేముందిలే... వాళ్ళిద్దర్నీ చూడాలన్పించి ఉంటుంది. అమ్మకి తెల్సు తను మరెంతో కాలం బ్రతకదని..... కానీ ఆ కోరిక ఏమిటా అని...."

"ఆఁ ఏం ఉంటుంది లెండి.. ఆమెకు మొదటి నుండీ మీ తమ్ముడంటేనే పక్షపాతం... అందుకే మిమ్మల్ని వ్యవసాయంలో కూలబడమని ఈ పల్లెలో ఉంచేసి, ఆయన్ని పట్నం పంపి ఇంజినీరుని చేసింది. ఆమె పేరనున్న ఆ పది ఎకరాల మామిడి తోట ఆయన పేర వ్రాయమంటుంది." అంది సరోజిని పరుషంగా.

"అదీ న్యాయమేగా!"

"ఆఁ.... ఏది న్యాయం? అసలు మీరింత మెతగ్గా ఉండబట్టే కదా లక్షలు చేసే ఆస్తంతా హారతి కర్పూరంలా కరిగిపోతోంది... అందరి బాధ్యతలూ మీ నెత్తినే వేసుకుంటారు. అటు మీ అక్కయ్య, మీ తమ్ముడు మాత్రం ఎలాంటి చీకూ చింతా లేకుండా లక్షలు సంపాదించుకుని హాయిగా బ్రతుకుతున్నారు. మనమేమో ఈ పల్లెటూర్లో మగ్గుతున్నాం."

"ఈ పల్లెలో మనకేం తక్కువ సరూ? పాడీ, పంటా సమృద్ధిగా ఉంది మనకు. కావాల్సినన్ని పాలు, పండ్లు, కూరగాయలు అన్నీ తాజాగా ఉంటాయి మనింట్లో. పాపం అక్కయ్యా వాళ్ళకీ, తమ్ముడు వాళ్ళకీ ఆ సిటీల్లో ఏం దొరుకుతాయ్ ఇలాంటివన్నీ? ఉండు... అమ్మ నిద్రపోయిందో లేదో చూసి వస్తా. ఆ గదిలో రామిని పడకోమన్నానీ మొద్దునిద్ర దానిది..." అంటూ తల్లి గది వేపు వెళ్ళాడు ఆనందరావు.

మేడపై గదిలో పడుకున్న రామారావు అతని భార్య రోహిణి ఆలోచనలు మరో విధంగా రూపుదిద్దుకుంటున్నాయ్.

"జీవితం అంతా మకుటంలేని మహారాణిలా బ్రతికారు మీ అమ్మ. ఆమెకేం కోరికలు మిగిలిపోయాయండీ ఇంకా?" అంది రోహిణి భర్త ముఖంలోకి చూస్తూ.

సమాధానం చెప్పకుండా కిటికీ గుండా బయట కన్పిస్తున్న ఆకాశాన్నీ, మెరుస్తున్న నక్షత్రాల్నీ చూస్తూ నిల్చుండి పోయాడు రామారావు. ఆదమరచి నిద్ర పోతున్న పాపాయిలా ఉంది పల్లె ఎంతో ప్రశాంతంగా. వెన్నెల దొంతరల గుండా మరింత తెల్లగా మెరుస్తున్నాయ్ మల్లెపూలు. గాలి వీచినప్పుడల్లా వాటి పరిమళం గదంతా నిండిపోతోంది.

భర్త ఏం మాట్లాడకపోయేసరికి మళ్ళీ తనే అందుకుంది రోహిణి.

"ఆ పదెకరాల మామిడి తోట మీ అన్నకే ఇవ్వమంటుందేమో మీ అమ్మ. ఆమె కోరిక అదే అయి ఉంటుంది లెండి... నేనా మాత్రం ఊహించుకోగలను..."

"ఆమె చెప్పినా చెప్పకపోయినా ఆ తోట అన్నయ్యకే చెందుతుంది రోహిణీ... పాపం... తను ఈ పల్లెలో ఉండిపోయి నన్ను సిటీకి పంపి, బాగా చదివించి, ఇంత వాణ్ని చేశాడు వాడు. మనకున్నది ఒక్కగానొక్క కొడుకు. వాడూ త్వరలో అమెరికా వెళ్ళిపోతున్నాడు. అన్నయ్యకి ఇద్దరు ఆడపిల్లలు... వాళ్ళ పెళ్ళిళ్ళకి చాలా డబ్బు అవసరం అవవచ్చు... అందుకే ఆ తోట వాడికి చెందటమే సమంజసం..." నిదానంగా అన్నాడు రామారావు. క్షీణించిన తల్లి ఆరోగ్య పరిస్థితి అతడిని కలవరపెడ్తోంది గానీ తల్లి పేరున ఉన్న ఆస్తి పాస్తుల గురించి అతడు లెక్కలు వేయడంలేదు.

"ఆఁ.... మీరు అలా అంటారని నాకు ముందే తెల్సులెండి. ఆ నగలేమో మీ అక్కయ్యకి ఇస్తారు. ఆ తోట మీ అన్నయ్యకి. ఇక మీరు మీ ఇంజినీరు డిగ్రీని చూసుకుంటూ మురిసిపోండి జీవితాంతం...." అంటూ విసురుగా వెళ్ళి పక్కపై వాలి పోయింది రోహిణి.

మరో గదిలో ఉన్న సుగుణ ఆలోచనలు మరో విధంగా పరుగు లెత్తుతున్నాయ్.

పాపం... అమ్మ... మరెంతో కాలం బ్రతకదు... ఆ తరువాత తనకీ పుట్టింటికీ ఋణం తీరిపోతుంది. తమ్ముళ్ళు ఎంత ఆప్యాయంగా చూసుకున్నా మరదళ్ళు ఎంత ఆదరించినా తల్లి తల్లే... అమ్మ లేకపోతే ఈ ఇంటితో తనకేం బంధం ఇక? ఇంతకీ అమ్మ కోరిక ఏమిటో! ఆ వడ్డాణం, ఆ రవ్వల గాజులు, కాసుల పేరు ఎవరికిస్తుందో..... న్యాయానికి అవి ఆడపిల్లగాబట్టి తనకే చెందాలి. కానీ అవి ఆనందు కూతుళ్ళకి ఇమ్మంటే పోతుంది. తన కూతుళ్ళకి చాలా నగలు చేయించింది తను. భగవంతుడి దయవల్ల తన భర్త నాలుగు చేతులా సంపాదిస్తున్నాడు. వ్యాపారం ఎన్నో లక్షల్ని ఆర్జించి పెట్టింది ఇప్పటికే... అనుకుంది తృప్తిగా.


మర్నాడు ఉదయం కుటుంబ సభ్యుల్ని అందర్నీ తన గదికి పిలిపించింది పార్వతమ్మ. ఓపిక తెచ్చుకుని దిండు గోడకు ఆనించి లేచి కూర్చోబోయింది.

"అహఁ... లేవద్దమ్మా.. నీరసంగా ఉన్నావ్... పడుకోలే..." అన్నాడు ఆనందరావు పక్కసరి చేసి, తల్లిని పడుకోబెట్టి ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంటూ. గోడకు ఆనుకుని నిల్చున్న రామారావును మంచంపై కూర్చోమని సైగ చేసింది పార్వతమ్మ. సరోజిని, రోహిణి, సుగుణ మరొక మంచం పై కూర్చున్నారు. పార్వతమ్మ ఏం చెప్పబోతోందా అన్న ఆదుర్దా అందరి మనసుల్లో ఉన్నా పైకి మాత్రం గంభీరంగా ఉండిపోయారు. నిదానంగా పెద్ద కొడుకు కళ్ళల్లోకి చూసింది పార్వతమ్మ. ఎండనక వాననక వ్యవసాయం పనుల్లో పడి పాడయిపోయాడు బంగారం లాంటి బిడ్డ... ఎంత రంగు ఉండేవాడు చిన్నప్పుడు! అనుకుంది ఆప్యాయంగా అతడివేపు చూస్తూ. సుగుణ వేపు దృష్టి మళ్ళించింది. మొట్టమొదటి

సారిగా తను తల్లి అయినప్పుడు తన చేతుల్లోకి తీసుకున్న పండంటి బిడ్డ రూపం ఆమె మనసులో మెదిలింది. రెండో కొడుకు వేపు చూసింది. భర్త పోలికలు కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నాయ్ అతనిలో. "ఏం రాముా... ఈ మధ్య కాస్త చిక్కిపోయావు? తిండీ తిప్పలు సమయానికి చూసుకోకపోతే ఎలానయ్యా?" అని ఒక్క నిముషం ఆగి,

"నేను చనిపోయాక నాపై ఎంత ఖర్చు పెట్టాలనుకుంటున్నార్రా?" అంది నిదానంగా కొడుకు లిద్దరి వేపు మార్చి మార్చి చూస్తూ. ఉలిక్కిపడ్డారు ఆగదిలో ఉన్న వాళ్ళంతా ఆ ప్రశ్నకు. ఎవ్వరూ ఊహించని ప్రశ్న అది. ఎలా జవాబివ్వాలో అర్థం కాక ఉక్కిరి బిక్కిరి అయ్యారు ఆనందరావు, రామారావూన్నూ. అదురుతున్న గుండెల్ని అదుపులోకి తెచ్చుకుంటూ కన్నీటి గుండా మసకగా కన్పిస్తున్న తల్లి వేపు చూసింది సుగుణ. ఆ మాటల్లోని అంతరార్థం ఏమై ఉంటుందా అని ఆలోచిస్తూ, అయోమయంగా చూస్తూ ఉండిపోయారు సరోజిని, రోహిణీనూ. అందరి ముఖాల్లోని ఆందోళన చూస్తూంటే నవ్వొచ్చింది పార్వతమ్మకు.

"మనుష్యులం బ్రతికి ఉండగానే కాకుండా చచ్చిపోయాక కూడా సమస్య అయి కూర్చుంటామ్రా! చనిపోయాక కూడా ఆచార వ్యవహారాల పేరిట ఎంతెంత ఖర్చు కదూ! ఊఁ... చెప్పండి.... నేను చనిపోయాక నాపైఎంత డబ్బు తగ లేయాలనుకుంటున్నారో!"



సన్నటి చిరునవ్వు పేలవంగా ఉన్న పార్వతమ్మ పెదాలపై కదలాడుతోంది. ఎవ్వరూ నోరు విప్పకపోయేసరికి చివరికి తనే అంది,

"ప్రాణం ఉన్నంత కాలమే మనిషి శరీరానికి విలువ. ఆ తరువాత ఆ కట్టె కోసం ఆచారాలు, మూఢ నమ్మకాల పేరిట డబ్బు ఖర్చు పెట్టడం శుద్ధ దండగ. నాకు తెలుసు. కనీసం పాతిక వేలన్నా తగలేస్తారు దినాలు, గినాలు అంటూ...."

మధ్యలో మాట్లాడటం ఆపి అందరి ముఖాల వేపు చూసింది. వాడిపోయిన మందారాల్లా కన్పించారు వాళ్ళంతా. తల తిప్పి కిటికీ వేపు చూసి, పెద్ద కొడుక్కి సైగ చేసింది అటు చూడమని. ఏం అంతుబట్టలా ఆనందరావుకి. కిటికీ గుండా ఒక పూరి గుడిశ కన్పిస్తోంది. రాటకు కట్టేసిన రెండు మేకలు కన్పిస్తున్నాయ్. నూకలు ఏరుకు తింటూన్న నాలుగు కోడి పిల్లలు కన్పిస్తున్నాయ్. పిడకలు గోడకు తడుతున్న పదేళ్ళ ముంతాజ్ కన్పిస్తోంది. ముఖంపై పడ్తున్న జుట్టుని మధ్య మధ్యలో పేడ చేత్తోనే పైకి నెట్టుకుంటోంది. వెలిసిన గులాబి రంగు గౌను పైన అంతా చినుగులు, పేడ మరకలూన్నూ. అర్థంకాక తల్లి ముఖంలోకి చూశాడు ఆనందరావు.

"ఆ పిల్ల ఉంది చూశావ్ ఆనందూ... చూడు ఎలా బక్క చిక్కిపోయి ఉందో.... దానికి మంచి ఆహారం గనుక దొరికిందో పుత్తడి బొమ్మలా ఉండదూ అది! దాన్ని చదివించాలని ఉందిరా. మూడో తరగతితో దాని చదువు ఆపేశారు, పూట గడవక. అదేమో స్కూలుకి పోతానంటుంది... ఏడుస్తుంది.. మొత్తుకుంటుంది. దాని తల్లి మనింటికి పనికి పంపుతుంది. తండ్రేమో రోజూ తాగివచ్చి భార్యనీ, పిల్లల్నీ చితకబాదుతాడు. ఆ నరకం చూస్తూంటే ఉసూరుమన్పిస్తుందిరా ఆనందూ... దానికి చదువంటే మహా ఆశ, ఆపేక్షరా.... పాపం... నేను కాటికి పోయాక ఇంకా నా కోసం వేలకి వేలు తగలేసే బదులు ఆ డబ్బు ఖర్చు పెట్టి దాన్ని చదివించారనుకో... ఒక ఆడ పిల్ల బ్రతుకు బాగుచేసినట్లు అవుతుంది. వాళ్లకి నే నచ్చచెప్తాను....." దగ్గు, ఆయాసం ఉక్కిరిబిక్కిరి చేస్తూంటే కాసేపు కళ్ళు మూసుకుంది.

సుగుణ పమిట చెంగుతో కన్నీళ్ళు వత్తుకుంటోంది. కళ్ళు దించుకుని నేల వేపు చూస్తూ ఉండిపోయారు. సరోజిని, రోహిణీ. కాసేపాగాక మంచి నీళ్ళు అందిస్తున్న చిన్నకొడుకు వేపు చూసింది పార్వతమ్మ

"ఒరేయ్ రాముా.. ముంతాజ్‌ని నీతోహైదరాబాదు తీసుకెళ్ళరా... అక్కడ మంచి స్కూల్లో చేర్పించు. దాని కాళ్ళ మీద అది నిలబడగలిగేటట్లు చదువుకోనివ్వండి దాన్ని. ఆ తరువాత వీలయితే దాన్నో ఇంటిదాన్ని చేయండి. అవకాశాలు రాక అదలాఉంది గానీ లేకపోతే మన పిల్లల్లాగే బాగానే చదువుకుంటుంది. తీరికున్నప్పుడంతా... అదో ఆ అరుగుపై కూర్చుని దాని తమ్ముడి పలకా బలపం పుచ్చుకుని ఏదేదో వ్రాసుకుంటూ ఉంటుందిరా, పాపం పిచ్చిపిల్ల" అంది చెమ్మగిల్లిన కళ్ళతో, ఆమె స్వరం క్షీణించి ఉన్నా ఏదో తపన. ఆకాంక్ష ఆమెనలా శక్తివంతంగా మాట్లాడేలా చేస్తున్నాయ్. ఆమె ముఖం పాలిపోయి ఉన్నా కళ్ళల్లో ఏదో కాంతి కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. అచేతనంగా ఉండిపోయిన శ్రోతలందరి వేపు చూస్తూ,

"ఏమ్రా... మీరంతా అలా చూస్తున్నారు?! నా అంతిమ కోరిక సబబుగా లేదా?" అంది కాస్తంత నిరాశగా. ముందుగా తేరుకున్న ఆనందరావు తల్లి తలపై చేయి ఉంచి, మృదువుగా రాస్తూ

"నీ కోరిక తప్పక నెరవేరుతుంది అమ్మా... ఇక్కడున్న అందరి తరఫున నేను మాట ఇస్తున్నా..." అన్నాడు. ❑